క్లుప్తంగా

మండల అభివృద్ధికి రూ.8కోట్లు మంజూరు చేశా



హెడ్ మాస్టర్‌కు ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న జువ్వాడి నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిందని, మండల అభివృద్ధికి రూ.8కోట్లు మంజూరు చేశానని కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.40.50లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రొసీడింగ్ పత్రాలను కుల సంఘాల సభ్యులకు అందజేశారు. ఇబ్రహీంపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ పత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్నకు అందజేశారు. ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



లక్ష్మీదేవిపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో

సారంగాపూర్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. గురువారం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేలో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం 6,073 దరఖాస్తులు పరిశీలనకు వచ్చాయని, 452 దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే చేసినట్లు తెలిపారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఎంపీడీవో శంకర్ గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలో 19 గ్రామాలుండగా.. 19 సర్పంచ్ స్థానాలు, 188 వార్డులున్నాయన్నారు. ఓటరు జాబితాలను వార్డులవారీగా తయారు చేశామని, వీటిపై అభ్యంతరాలుంటే తెలపాలని అధికారులు కోరారు. ఎంపీవో రాజశేఖర్, నరేందర్, నాయకులు కాయితి నాగరాజు, కల్లెడ శంకర్, జవ్వాజి రవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



అఫ్జల్‌మియా

బుగ్గారం: ఎంపీడీవోగా షేక్ అఫ్జల్‌మియా గురువారం పూర్తి అదనపు బాధ్యతలను చేపట్టారు. ఇంతకుముందు ఎంపీడీవోగా ఉన్న శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఎంపీవోగా ఉన్న అఫ్జల్‌మియాను ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు.


పాఠశాలకు సౌండ్‌బాక్సు అందజేత



సౌండ్‌బాక్సు అందిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: డబ్బా ప్రాథమిక పాఠశాలకు పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గురువారం డీజే సౌండ్‌బాక్సును అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తనుగుల రమేశ్, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మేకల రాజన్న, ఆందుర్తి స్వామి, సత్యనారాయణ, లింగయ్య, రాజ్‌కుమార్, మ్యాకల మనోజ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఆడెపు నరేశ్, బొల్లు శంకర్, వేముల నర్సయ్య, అంగన్‌వాడీ టీచర్ గంగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లాంకెట్లు పంపిణీ



సారంగాపూర్: సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో గురువారం ప్రతి విద్యార్థికి కొత్త బ్లాంకెట్లు(రగ్గులు) ఎంఈవో కిషోర్ పంపిణీ చేశారు. మొత్తం 286 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. సారంగాపూర్‌తో పాటు బీర్‌పూర్ కేజీబీవీ విద్యార్థులకు బ్లాంకెట్లు వచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయులున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



సంచార పుస్తకాలయం ప్రారంభిస్తున్న డీఎస్పీ

జగిత్యాల: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంచార పుస్తకాలయాన్ని ప్రారంభించారు. ప్రజలు సెల్‌ఫోన్ మోజులో పడి పుస్తకాలు చదవడంలో వెనబడిపోతున్నారన్నారు. సీఐ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



రాయికల్: కొత్తపేట గ్రామంలోని రాజరాజేశ్వర నాగాలయంలో గురువారం హుండీ లెక్కించగా రూ.2,19,518 ఆదాయం వచ్చినట్లు ఈవో విక్రమ్‌గౌడ్ తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, అర్చకుడు రాజేశ్వరశర్మ, చైర్మన్ దానవేని రాము, నాయకులు బత్తిని రాజేశం, అశోక్, మహేశ్, రాజిరెడ్డి, వెంకట్, సత్తయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

రాయికల్ పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. రూ.86,089 ఆదాయం వచ్చినట్లు ఈవో విక్రమ్ తెలిపారు. డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, అర్చకుడు ధనుష్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, పాలకమండలి సభ్యులు రాజిరెడ్డి, కల్లెడ రాజు, ప్రభాకర్, మనోజ్, జ్యోతి, గణేశ్ పాల్గొన్నారు.

1098కి ఫోన్ చేయాలి



నేరెళ్లలో అవగాహన ర్యాలీ

ధర్మపురి: ఆడపిల్లలు ఎలాంటి సమస్యల్లో ఇరుక్కున్నా 1098కి ఫోన్ చేయాలని చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది రజిత, మధుసూదన్ సూచించారు. నేరెళ్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గురువారం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ చేపట్టారు. పాఠశాల సిబ్బంది తదితరులున్నారు.

అభివృద్ధి పనుల్లో కదలిక ఏది..?

- రూ.1.99కోట్ల పనులకు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం తీర్మానం
- గత పాలకవర్గ తీర్మానం అమలు కాని వైనం



కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కథలాపూర్: అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటల క్రయవిక్రయాల్లో మార్కెట్ కార్యాలయాలదే ప్రధాన పాత్ర. కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిధులు పుష్కలంగా ఉన్నా.. మార్కెట్ పరిధిలో అభివృద్ధి పనులకు ఏళ్లుగా అడుగులు పడటం లేదని రైతులు పేర్కొంటున్నారు. గత నెలలో కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బాధ్యతలు తీసుకోవడంతో అభివృద్ధి పనుల్లో కదలిక వస్తుందా..? లేక జాప్యం జరుగుతుందా అనేది మండలంలోని రైతుల్లో ఆసక్తికరంగా మారింది.

రూ.4కోట్లు నిల్వ..

కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 19 గ్రామాలున్నాయి. మండలంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి, పసుపు, పప్పు దినుసుల పంటలు సాగు చేస్తుంటారు. పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా మార్కెట్ ఫీజు అధికారులు వసూలు చేస్తుంటారు. ఇలా మార్కెట్ ఫీజు రూపంలో కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సుమారు రూ.4కోట్ల ఆదాయం నిల్వ ఉన్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. కానీ మార్కెట్ కమిటీ పరిధిలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు వచ్చే రైతులు, ధాన్యం కొనుగోళ్లకు వసతులు ఏర్పాటు చేయకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పనులకు తీర్మానం..

కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సభ్యులు వారం రోజుల క్రితం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కథలాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో రూ.1.10కోట్లతో గోదాం నిర్మాణం, రూ.50లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, కార్యాలయం ఆవరణలో చదును చేయించడానికి రూ.24లక్షలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి రూ.15లక్షలు వెచ్చించి పనులు చేయాలని తీర్మానించారు. గత పాలకవర్గ సభ్యులు కూడా ఇవే పనులకు తీర్మానం చేసినా మోక్షం కలగలేదు. కొత్త పాలకవర్గ సభ్యులు ప్రత్యేక చొరవ చూపి మార్కెట్ అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయించి సేవలందించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

దృష్టి పెట్టాలి



మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు రైతులకు ప్రయోజనం చేకూర్చేవాటిపై మొదటగా దృష్టి పెట్టాలి. మార్కెట్ కమిటీలో ఆదాయం పుష్కలంగా ఉన్నప్పుడు అభివృద్ధి పనులు త్వరగా చేయించాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు విశ్రాంతి భవనం నిర్మించాలి. వరి, మొక్కజొన్న పంటలే కాకుండా మండలంలో రైతులు పండించిన ప్రతీ పంటను ఇక్కడే కొనుగోలు చేసి మద్దతు ధర అందేలా మార్కెట్ కమిటీ బాధ్యత వహించాలి.

– ఎండీ రఫీ, రైతు, దుంపేట గ్రామం

అభివృద్ధి చేస్తాం



మార్కెట్ కమిటీ తొలి సమావేశంలోనే రూ.1.99కోట్లతో అభివృద్ధి పనులు చేయాలని తీర్మానించాం. ఆ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయించాలనే లక్ష్యంతో ఉన్నాం. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో మార్కెట్ కమిటీ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. రైతులకు సేవలందించడానికి మార్కెట్ కమిటీ తరఫున కృషి చేస్తాం.

– పూండ్ర నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, కథలాపూర్



సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల నుంచి జగిత్యాల జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై లక్ష్మీదేవిపల్లి గ్రామ శివారులోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ వంతెనకు ఇరువైపులా సెఫ్టీవాల్స్ దెబ్బతిన్నాయి. ఈ రోడ్డు 24 గంటలపాటు భారీ, చిన్న వాహనాలతో రద్దీగా ఉంటుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే డి–53 ప్రధాన కాలువపై లక్ష్మీదేవిపల్లి వద్ద దాదాపు 50 సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన వంతెన ఇరువైపులా సెఫ్టీవాల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చక్రూనాయక్, డీఈ, నీటిపారుదల శాఖ(ఎస్‌ఆర్‌ఎస్‌పీ), సెల్ నంబర్: 9652638815

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్రీడలతో శారీరక దృఢత్వం



జగిత్యాలరూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో రమాదేవి

జగిత్యాలరూరల్: క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందని ఎంపీడీవో రమాదేవి అన్నారు. గురువారం మినీ స్టేడియంలో మండల బాలురకు సీఎం కప్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో గాయత్రి, ఎంపీవో రవిబాబు, పీఈటీలు కోటేశ్వర్‌రావు, అజయ్‌బాబు, జమున, వెంకటలక్ష్మి, మల్లీశ్వరి, హారిక, వినిత్, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఆరె తిరుపతి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: క్రీడాకారులు మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి, జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికై రాణించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మండలస్థాయిలో సీఎం కప్ పోటీలను నిర్వహించగా.. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో గెలుపొందినవారికి పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఎంఈవో మధు, పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, హర్షద్, ప్రసాద్, పీడీలు రాజు, రవి, అశోక్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ మండలస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటినవారికి గురువారం ఎంపీడీవో శంకర్, ఎంఈవో శ్రీనివాస్ బహుమతులు అందించారు. హెచ్‌ఎం వెంకటేశం, దరందీప్, శశిధర్, పీడీలు రవీందర్, నవీన్, రాజేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లాపూర్: సీఎం కప్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఆలకుంట భాస్కర్, సూర అరవింద్ ఎంపికవడం గర్వకారణమని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో వారిని అభినందించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ముష్కరి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: క్రీడల్లో నైపుణ్యం సాధించి రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎదగాలని అధికారులు విద్యార్థులకు సూచించారు. పెగడపల్లిలో సీఎం కప్‌లో భాగంగా మూడు రోజులుగా మండలస్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడలు గురువారం ముగిశాయి. మండలం నుంచి జిల్లాస్థాయికి ఎంపికైన 80 మంది క్రీడాకారులకు అధికారులు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై రవికిరణ్, ఎంఈవో సులోచన, హెచ్‌ఎం లలిత, పీఈటీలు రమేశ్, నవీన్, కల్యాణ్, వివిధ పార్టీల నాయకులు నరేందర్‌రెడ్డి, భూమేశ్వర్, తిరుపతి, కిషన్, మల్లారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకే సీఎం కప్ అని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. గురువారం పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో సీఎం కప్ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజేతలకు రూ.15వేల విలువ గల బహుమతులు అందజేశారు. కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఎంఈవో రాఘవులు, లయన్స్ క్లబ్ కార్యదర్శి కడకుంట్ల నరేశ్, కోశాధికారి నర్సయ్య, సుదర్శన్‌రెడ్డి, భూపతిపూర్‌లో ప్రసాద్, ఏనుగు ముత్యంరెడ్డి, జక్కుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: కండ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు సీఎం కప్ మండలస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీలు వినిత్, అజీమ్ తెలిపారు. ఇందుప్రియ, అంజలిని గురువారం ప్రిన్సిపాల్ సరితదేవి అభినందించారు.

మేడిపల్లి: భీమారం మండలస్థాయి క్రీడాపోటీలు ముగిశాయి. మండలంలోని అన్ని గ్రామాల నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తహసీల్దార్ రవికిరణ్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు.

కోరుట్ల రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సీఎం కప్ క్రీడల పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు పంపుతామని ఎంఈవో నరేశం తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కౌన్సిలర్లు తిరుమల, నాగభూషణం, పుప్పాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలో మూడు రోజులుగా జరుగుతున్న సీఎం కప్ క్రీడలు గురువారం ముగిశాయి. తహసీల్దార్ ముంతాజొద్దీన్, ఎంపీడీవో లచ్చాలు, ఎంఈవో నాగభూషణం, ఎస్సై కుమారస్వామి, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల రూరల్: అయిలాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ గురువారం భూమి పూజ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోరు బావి, గ్రామంలో మరో బోరు బావికి ఎంపీ రాజ్యసభ నిధులు మంజూరు కాగా.. ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. జిల్లా రైతుబంధు మాజీ కన్వీనర్ చీటి వెంకట్రావు, నాయకులు రాజేశ్, సందయ్య, తుక్కారెడ్డి, సూపర్‌వైజర్ ధనుంజయ, రమణ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: కోదండ రామాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఇటీవల ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఎన్నికైన సంగతి తెలిసిందే. గురువారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టాఫీసులు తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న శివాజీ

కథలాపూర్: భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లోని పోస్టాఫీసులను కరీంనగర్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను చూశారు. డిపాజిట్ డబ్బుల వివరాలు సేకరించారు. ఉత్తరాల బట్వాడ తీరును సిబ్బందినడిగి తెలుసుకున్నారు. బీపీఎం అరుణ్ ఉన్నారు.

క్రీడావైభవం చాటాలి



క్రీడాకారులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

జగిత్యాల: చస్బోబాల్ క్రీడ చాలా ప్రాముఖ్యమైందని, మానసికోల్లాసం లభిస్తుందని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల పంజాబ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి చస్బోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు లక్కీరాం, ఆజాద్ ఫాతిమా ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో నాల్గో స్థానం సాధించారు. ఈ సందర్భంగా వారిని అభినందించి మాట్లాడారు. మరిన్ని టోర్నమెంట్లలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర క్రీడావైభవాన్ని చాటిచెప్పాలన్నారు. పాఠశాల బృందం పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్: కొత్తపేట గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మణికంఠ రాష్ట్రస్థాయి గణిత పోటీలకు ఎంపికవ్వగా.. గురువారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రావు, ఉపాధ్యాయులు దాసరి కృష్ణహరి, సురేందర్, నరేశ్ పాల్గొన్నారు.

ధర్మపురి: జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణిత ప్రతిభాపాటవ పరీక్షలో గ్రామీణ విద్యార్థిని జిల్లా ప్రథమ స్థానం బహుమతి సాధించింది. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల విద్యార్థులు హాజరయ్యారు. నేరెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే ధర్మపురికి చెందిన రామెల్ల కృష్ణవేణి జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకుంది.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

కోరుట్ల: సినీ నటుడు మంచు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. జర్నలిస్టుపై మోహన్‌బాబు చేసిన దాడికి నిరసనగా పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు గురువారం సాయంత్రం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు అన్నం అనిల్, బీఆర్‌ఎస్ నాయకుడు దారిశెట్టి రాజేశం, బీజేపీ నాయకుడు ఇందూరి సత్యం, పలువురు కౌన్సిలర్లు, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

మెట్‌పల్లి: పలు కుల సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు విజ్ఞప్తి మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సుమారు రూ.30లక్షలు మంజూరు చేశారన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



మేడిపల్లి: రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. భీమారం మండలం దేశాయిపేట గ్రామంలో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా విద్యాధికారిని సన్మానించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏవీఎల్‌ఎన్ చారి, మాజీ అధ్యక్షుడు మంచాల కృష్ణ, సీనియర్ పాత్రికేయుడు టీవీ సూర్యం, మండల విద్యాధికారి మధుసూదన్‌రెడ్డి, బోయినిపెల్లి ఆనంద్‌రావు, యాళ్ల అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎల్.రమణ కుమారుడు కార్తికేయ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవాభారతి ఆధ్వర్యంలో వాల్మీకి ఆవాసంలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మొక్కలు తొలగించిన వ్యక్తికి జరిమానా

మెట్‌పల్లిరూరల్: ఉపాధిహామీ పథకంలో భాగంగా నాటిన మొక్కలను తొలగించిన ఓ వ్యక్తికి పంచాయతీ అధికారులు జరిమానా విధించారు. జగ్గాసాగర్ శివారులో రహదారికిరువైపులా మొక్కలు నాటారు. నాటిన మొక్కలు కొంతమేర పెరిగాయి. వీటిని వెల్లులకు చెందిన అల్లూరి ధనుంజయ అనే వ్యక్తి తొలగించారు. విషయం పంచాయతీ అధికారులకు దృష్టికి వెళ్లింది. దీంతో జగ్గాసాగర్ కార్యదర్శి ప్రశాంత్ రూ.9వేలు జరిమానా విధించారు.

ప్రిన్సిపాల్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకయ్యకు ప్రగతి ఫౌండేషన్ సంస్థ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందజేసింది. విద్యారంగంలో ఆయన చేసిన కృషికి గాను హైదరాబాద్‌లో చైర్మన్ రాజు పురస్కారాన్ని అందజేశారు.